ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్
1
RNI No: APTEL/2023/87888
సోమవారం
08 సెప్టెంబర్ 2025

భారత్ వంటి దేశాలపై ఆంక్షలు సరైన నిర్ణయమే: జెలెన్స్కీ

సెప్టెంబర్ 8, (రిపబ్లిక్ న్యూస్):రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేసే భారత్ వంటి దేశాలపై ఆంక్షలు విధించడం సరైన నిర్ణయమేనని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ వ్యాఖ్యానించారు. మాస్కో-కీవ్ మధ్య సంధి కుదిర్చేందుకు భారత్ దౌత్య యత్నాలు చేస్తున్నా ఆయన నుంచి ఇటువంటి వ్యాఖ్యలు రావడం గమనార్హం.

జెలెన్స్కీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "రష్యాతో వ్యాపార లావాదేవీలు చేస్తున్న దేశాలపై టారిఫ్లు విధించడం సరైన చర్యే" అని పేర్కొన్నారు. ఇటీవల షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ తియాంజెన్లో చైనా అధినేత జిన్పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్తో కలిసి వేదిక పంచుకోవడంపై స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. అలాస్కాలో ట్రంప్-పుతిన్ చర్చలు విఫలమైన నేపథ్యంలో రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించేందుకు అమెరికా సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో జెలెన్స్కీ ప్రకటన వెలువడటం గమనార్హం. నేషనల్ ఎకనామిక్ కౌన్సిల్ డైరెక్టర్ కెవిన్ హస్సెట్ మాస్కోపై మరిన్ని సరికొత్త ఆంక్షలు విధిస్తారని వెల్లడించారు. "ఉక్రెయిన్పై రష్యా చేస్తున్న యుద్ధంలో సహకరించే వారిపై ఆంక్షలు అమలయ్యేలా చూసే బాధ్యత మాదే. ఉదాహరణకు భారత్ ఇంకా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. ఈ నేపథ్యంలో దీనిపై స్పందించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. ఆంక్షల స్థాయి.. వాటిని విధించిన సమయంపై ప్రస్తుతం, భవిష్యత్తులో కూడా మాట్లాడుకొంటారు" అని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ఉక్రెయిన్తో యుద్ధాన్ని ముగించాలని భారత్ కూడా ప్రయత్నాలు చేస్తోంది. ప్రధాని మోదీ అటు పుతిన్, ఇటు జెలెన్ స్కీతో చర్చలు జరుపుతున్నారు. గత నెల రెండో వారంలో పుతిన్తో భేటీకి ముందు ఉక్రెయిన్ అధినేతతో మాట్లాడారు. "ఉక్రెయిన్కు సంబంధించి ఇటీవలి పరిణామాలపై జెలెన్స్కీతో మాట్లాడి, ఆయన అభిప్రాయాలు తెలుసుకున్నాను. ఈ వివాదాన్ని వీలైనంత త్వరగా, శాంతియుతంగా పరిష్కరించడంపై భారత్ స్థిరమైన వైఖరి గురించి తెలియజేశాను. యుద్ధం ముగింపు విషయంలో సాధ్యమైన సహకారాన్ని అందించేందుకు, ఉక్రెయిన్తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు భారత్ కట్టుబడి ఉంది" అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. తామిద్దరం కీలక అంశాలపై వివరంగా చర్చించినట్లు జెలెన్స్కీ సైతం పేర్కొన్నారు. అయినా ఆయన నుంచి భారత్పై ప్రతికూల ప్రకటన వెలువడటం గమనార్హం.

ఆసియా కప్ విజయం.. భారత క్రీడలో గర్వించదగ్గ మైలురాయి: సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబర్ 8, (రిపబ్లిక్ న్యూస్): భారత పురుషుల హాకీ జట్టుకు ఏపీ సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆసియా కప్ 2025లో అత్యుత్తమ విజయం సాధించారని కొనియాడారు. దక్షిణ కొరియాపై విజయం సాధించి 8 ఏళ్ల తర్వాత టైటిల్ సాధించిందని పేర్కొన్నారు.



ఈ విజయం భారత క్రీడలో గర్వించదగ్గ మైలురాయి అని చెప్పారు. యువ అథ్లెట్ల ధైర్యం, పట్టుదలకు ఉదాహరణ అన్నారు. భారతదేశ హాకీ వారసత్వాన్ని ఇకపైనా ముందుకు తీసుకెళ్తారని ఆకాంక్షించారు. ప్రపంచ వేదికపై మరిన్ని చిరస్మరణీయ ప్రదర్శనలు ఇస్తారని విశ్వసిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు.

మేజర్ ధ్యాన్ చంద్ స్ఫూర్తితో జట్టు సభ్యులు ముందుకు సాగాలి: మంత్రి మండిపల్లి

భారత పురుషుల హాకీ జట్టుకు మంత్రి మండిపల్లి రాంప్రసాదొడ్డి అభినందనలు తెలిపారు. మేజర్ ధ్యాన్చంద్ స్ఫూర్తితో జట్టు సభ్యులు ముందుకు సాగాలన్నారు. ఎనిమిదేళ్ల తర్వాత టైటిల్ సాధించి జాతిని గర్వపడేలా చేశారని పేర్కొన్నారు. ఈ విజయం యువ అథ్లెట్లకు స్ఫూర్తినిచ్చే మైలురాయి అని వివరించారు. ప్రపంచ వేదికపై మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

రేవంత్ రెడ్డిపై పరువునష్టం దావా కేసును కొట్టివేసిన సుప్రీం

ఢిల్లీ, సెప్టెంబర్ 8, (రిపబ్లిక్ న్యూస్): రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా దాఖలైన పరువునష్టం దావా కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది.

తెలంగాణ భాజపా దాఖలు చేసిన పిటిషన్ ను డిస్మిస్ చేసింది. ఎన్నికల్లో గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారంటూ రేవంత్ రెడ్డి ప్రచారం చేయడంపై భాజపా పిటిషన్ దాఖలు చేసింది. గత నెలలో ఇదే విషయమై ఆ పార్టీ వేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. ఈ ఉత్తర్వులను భాజపా సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. తాజాగా వాదనలు విన్న సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం పిటిషన్ను డిస్మిస్ చేసింది. రాజకీయపరమైన అంశాల్లో జోక్యం చేసుకోబోమని తేల్చి చెప్పింది. రాజకీయ నాయకులకు సున్నితమైన మనసు ఉండకూడదని పేర్కొంది. కోర్టులను రాజకీయ యుద్ధ క్షేత్రాలుగా మార్చవద్దని వ్యాఖ్యానించింది.

అఫీషియల్.. 46 ఏళ్ల తర్వాత కమల్, రజనీ మల్టీస్టారర్

కోట్ల మంది సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న మల్టీస్టారర్ అధికారికమైంది. ఇండస్ట్రీలో అగ్ర కథానాయకుల్లో ముందు వరుసలో ఉండే కమల్హాసన్, రజనీకాంత్లు ఇప్పుడు 46 ఏళ్ల తర్వాత కలిసి స్క్రీన్పై కనిపించనున్నారు. వీరిద్దరి కాంబోలో మల్టీస్టారర్ రానుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాను కమల్ హాసన్ అధికారికంగా ప్రకటించారు. దీంతో వీరి అభిమానులు సంబరపడుతున్నారు. ఇటీవల జరిగిన సైమా అవార్డుల వేడుకలో కమల్ హాసన్ బిగ్ అప్డేట్ ఇచ్చారు. 'మీరు, రజనీకాంత్ కాంబినేషన్ లో ఓ సినిమాను ఆశించవచ్చా' అని వ్యాఖ్యాత అడిగిన ప్రశ్నకు ఆయన ఆసక్తికర సమాధానమిచ్చారు. "ప్రేక్షకులు మా కాంబినేషన్ ను ఇష్టపడితే మంచిదే కదా.. వారు సంతోషంగా ఉంటే మాకూ ఆనందమే. మేమిద్దరం కలిసి నటించాలని ఎన్నోఏళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నాం. కానీ, ఇన్ని రోజులు అది కుదర్లేదు. త్వరలోనే మీ ముందుకు కలిసి రానున్నాం. అది మిమ్మల్ని సర్ప్రైజ్ చేస్తుంది" అని స్పష్టంచేశారు. దీంతో ఈ బిగ్ మల్టీస్టారర్ అధికారికమైంది. అయితే, ఈ ప్రాజెక్ట్ వివరాలు మాత్రం ఆయన పంచుకోలేదు. ఇక వీరిద్దరి మధ్య అభిప్రాయబేధాలు ఉన్నాయంటూ వస్తోన్న వార్తలపై కూడా కమల్ స్పందించారు. "మా మధ్య ఎలాంటి భేదాలు లేవు. ఇవన్నీ మీరు సృష్టించుకున్నవే. మేం ఎప్పుడూ ఒకరికి ఒకరం పోటీ అనుకోలేదు. మేమిద్దరం కలిసి నటించేందుకు అవకాశం కోసం ఎదురుచూశాం. ఒకరి సినిమాలు మరొకరం నిర్మించాలని కూడా ప్రయత్నం చేశాం" అని కమల్ హాసన్ తెలిపారు.లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వీరిద్దరి మల్టీస్టారర్ రానున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. లోకేశ్ గ్యాంగ్స్టర్ డ్రామాగా ఓ సినిమాని తెరకెక్కించనున్నారని, రజనీ – కమల్ ఇద్దరూ గ్యాంగ్స్టర్లుగానే సందడి చేయనున్నారని కోలీవుడ్లో చర్చ జరుగుతోంది. ఇదే నిజమైతే 46 ఏళ్ల తర్వాత రజనీ– కమల్ మళ్లీ కలిసి కెమెరా ముందుకువచ్చినట్టవుతుంది. ఈ ఇద్దరూ కలిసి 5 భాషల్లో 20కి పైగా సినిమాలు చేశారు. అయితే అదంతా 1970వ దశకంలోనే. ఆ తర్వాత ఈ ఇద్దరూ మళ్లీ తెరను పంచుకొనే అవకాశం రాలేదు. ఇన్నేళ్లకు లోకేశ్ రాసిన కథలో వీరు సందడి చేయనున్నట్లు తెలుస్తోంది.

మినీ కప్.. ఆసియాలో నంబర్ 2 టీమ్ ఏంటో తేలుతుందా?

పాకిస్థాన్, యూఏఈ, అఫ్గానిస్థాన్.. ఆసియా కప్ ముంగిట ట్రై సిరీస్ ఆడాయి. ఇందులో పాక్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో అఫ్గాన్ను పాక్ చిత్తు చేసింది. దీంతో ఆసియా కప్లో ఎలాగైనా పాక్ను ఓడించాలనే లక్ష్యంతో అఫ్గాన్ బరిలోకి దిగనుంది. మరోవైపు 'రెండో బెస్ట్' టీమ్గానూ తమను పరిగణించని వారికి తమ ఆటతీరుతోనే సమాధానం ఇవ్వాలని పాక్ చూస్తోంది. హాంగ్కాంగ్ – అఫ్గానిస్థాన్ (సెప్టెంబర్ 9) మ్యాచ్లో ఆసియా కప్ 2025 ఎడిషన్ ప్రారంభం కానుంది.

ఆ ప్రశ్నతో..

ట్రై సిరీస్ ప్రారంభానికి ముందు మూడు జట్ల సారథులు ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓ విలేఖరి.. పాక్ కెప్టెన్ సల్మాన్ అఘా ముందే అఫ్గాన్ సారథి రషీద్కు ఓ ప్రశ్న సంధించాడు. 'ఆసియాలోనే రెండో అత్యుత్తమ జట్టు' అయిన మీరు మినీకప్కు ఎలా సన్నద్ధమయ్యారు? అని అడిగాడు. ఆ ప్రశ్నకు సల్మాన్ అఘా చాలా ఇబ్బందిపడ్డాడు. సోషల్ మీడియాలోనూ వైరల్ గా మారిపోయింది. ప్రపంచ క్రికెట్లో పెద్ద జట్లతో సరిపోల్చే టీమ్ తమ దారుణ ప్రదర్శనతో విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అయితే, ట్రై సిరీస్ను పాక్ నెగ్గినా.. ఇప్పటికీ అఫ్గాన్ నుంచి ముప్పు పొంచిఉందని క్రికెట్ వర్గాలు చెబుతున్నమాట. శ్రీలంక కూడా తామేం తక్కువ కాదని నిరూపించుకొనేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తుందనడంలో సందేహం లేదు.

ఆ ఇద్దరూ లేకపోవడం వల్లనేనా?

సీనియర్ క్రికెటర్లు మహ్మద్ రిజ్వాన్, బాబర్ అజామ్ గత కొన్నేళ్లుగా పాక్ క్రికెట్లో కీలకపాత్ర పోషించారు. ఇటీవల వారిద్దరి ప్రభావం పెద్దగా లేకపోవడంతో జట్టులో స్థానం కోల్పోవాల్సి వచ్చింది. ఇప్పుడు ఆ ఇద్దరూ లేకపోవడంతో పాక్ కాస్త బలహీనంగానే కనిపిస్తోంది. యూఏఈ, అఫ్గాన్పై ముక్కోణపు సిరీస్ నెగ్గిన ఉత్సాహంతో పాక్ ఆసియా కప్ బరిలోకి దిగనుంది. గ్రూప్ స్టేజ్లో భారత్లో మినహా మిగతా జట్ల నుంచి పెద్దగా ఇబ్బంది రాకపోవచ్చు. అయితే, సూపర్ 4లో మాత్రం అఫ్గాన్, శ్రీలంక వంటి గట్టి టీమ్లు ఎదురవుతాయి. ట్రై సిరీస్ ఓటమికి అఫ్గాన్ 'రివెంజ్' ప్లాన్ చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

పెద్ద జట్లకు షాక్ తగులుద్దా?

టీ20ల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో అంచనా వేయడం చాలా కష్టం. గతంలోనూ పెద్ద జట్లకు షాక్ తగిలిన సందర్భాలూ ఉన్నాయి. ఈసారి కూడా అలాంటి ప్రమాదం లేకపోలేదు. భారత్, పాకిస్థాన్, యూఏఈతోపాటు ఒమన్ కూడా గ్రూప్దశలో తలపడనుంది. తమను తక్కువగా అంచనా వేయొద్దని.. పెద్ద జట్లకు షాక్ ఇస్తామని ఇప్పటికే ఒమన్ ప్లేయర్ సుఫ్యాన్ మెహమూద్ చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్గా మారాయి. ఒకప్పుడు చిన్న జట్టుగా పిలవబడిన అఫ్గాన్ ఇప్పుడు అత్యుత్తమ ఆటతీరుతో ఆకట్టుకుంటోంది. ఈ ఆసియా కప్ లోనూ యూఏఈ, ఒమన్ను తక్కువగా అంచనా వేయొద్దని ఇప్పటికే క్రికెట్ విశ్లేషకులు సూచించారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. సంచలనం నమోదుకావడం ఖాయమే.

ఇంటి చిట్కాలు

మొక్కలు వాడిపోకుండా ఎండల నుంచి కాపాడే సహజ ఎరువులు, ఇంట్లోనే సులభంగా చేసుకోవచ్చు ఎలాగంటే

ఎండల దెబ్బకి మొక్కలు ఎండిపోతాయి. ఇప్పటికే చాలా మొక్కలు ఎండిపోవడం ప్రారంభించాయి. అందుకే మొక్కల్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఎండలకు తట్టుకుని నిలబడటానికి మొక్కలకు చల్లదనం అవసరం.

వేసవి కాలం రాబోతుంది. ఇప్పటికే ఎండలు దంచికొడుతున్నాయి. ఎండలకి మనుషులే కాదు మొక్కలు కూడా అల్లాడిపోతాయి. ఎండల దెబ్బకి మొక్కలు ఎండిపోతాయి. ఇప్పటికే చాలా మొక్కలు ఎండిపోవడం ప్రారంభించాయి. అందుకే మొక్కల్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఎండలకు తట్టుకుని నిలబడటానికి మొక్కలకు చల్లదనం అవసరం. మొక్కలకి చల్లదనాన్ని ఇవ్వడానికి కొన్ని ఎరువులు సాయపడతాయి. ఈ ఎరువుల వల్ల మొక్కలు పోషకాలతో పాటు చల్లదనాన్ని కూడా పొందుతాయి. వేసవిలో, ఎక్కువగా ద్రవ ఎరువులను వాడాలి. వీటిలో నత్రజని, కాల్షియం, సల్ఫర్, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి మొక్కలకు మంచి పోషణను అందిస్తాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల మొక్కలు ఎండిపోవు. అలాంటి నాలుగు ఎరువులు ఎలా తయారు చేయాలో ఇక్కడ తెలుసుకుందాం.

ఆవు పేడ ఎరువు

సులభంగా లభించే ఎరువులలో ముందుగా గుర్తుకు వచ్చే పేరు ఆవు పేడ. ఇది ఇంటి తోటపనికి బాగా పనికివస్తుంది. అంతేకాకుండా సులభంగా లభిస్తుంది. దీనిని తయారు చేయడానికి, ఆవు పేడ పిడకల్ని ఒక బకెట్ నీటిలో వేసి, మూతపెట్టి 3 రోజులు అలాగే ఉంచండి. 3 రోజుల తర్వాత, దానిని మరొక పాత్రలోకి వడకట్టండి. ఈ మిశ్రమాన్ని ప్రతి 2 నుంచి 3 రోజులకు ఒకసారి మొక్క మట్టిలో కలపండి. మీరు కావాలనుకుంటే దీనిని ద్రవ ఎరువుగా ఉపయోగించవచ్చు.

మజ్జిగతో ఎరువు

పెరుగును బాగా చిలికి వెన్న తీసిన తర్వాత మిగిలిన మజ్జిగను కూడా మొక్కలకు ఎరువుగా ఉపయోగించవచ్చు. ఇందుకోసం ఇంట్లో తయారుచేసిన మజ్జిగను ప్లాస్టిక్ బకెట్లో నింపండి. ఆ తర్వాత దాని ఓ మూత పెట్టి పది రోజులు అలానే ఉంచండి. ఈ సమయంలో మజ్జిగ బాగా పులిసిపోతాయి. ఆ తర్వాత ఒక లీటర్ నీటిలో 200 మి.లీ మజ్జిగను కలపండి. బాగా కలిపిన తర్వాత ఈ మిశ్రమాన్ని 500 మి.లీ చొప్పున మొక్కకు పోయాలి. ఈ మిశ్రమం వల్ల మొక్కకు చల్లదనంతో పాటు పోషకాలు కూడా బాగా అందుతాయి.

వేప పిండి

వేప పిండిని కూడా చల్లని ఎరువుగా మొక్కలకు ఉపయోగించవచ్చు. నిజానికి వేప పిండి మొక్కలో నత్రజని లభ్యతను పెంచుతుంది. దీనిని ఉపయోగించడానికి ముందుగా 50% తోట మట్టి, 30% ఆవు పేడ ఎరువు, 20% వేప పిండి మిశ్రమాన్ని బాగా కలపండి. ఇప్పుడు దానిపై తేలికగా నీళ్లు చల్లండి. ఆ తర్వాత దీనిని మొక్కలకు ఎరువుగా ఉపయోగించవచ్చు. మొక్కలో మట్టిలో ఈ మిశ్రమాన్ని కలిపితే సరిపోతుంది.

ఎండిన ఆకుల కంపోస్ట్

చెట్లు, మొక్కల నుంచి ఎండిన ఆకులు రాలి కింద పడతాయి. ఇలాంటి ఆకుల్ని చెత్తగా పారేసే బదులు మొక్కలకు ఎరువుగా ఉపయోగించవచ్చు. వీటిని సేంద్రీయ ఎరువులు అంటారు. ఇది నేలను సారవంతం చేయడానికి పనిచేస్తుంది. ఇది గరిష్టంగా నీటిని గ్రహించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. వేసవిలో మొక్కల వేర్లను చల్లగా ఉంచడానికి దీనిని ఉపయోగించవచ్చు. ఇందుకోసం ఎండిన ఆకుల్ని తీసుకుని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకుని ఒక బక్కెట్లోకి తీసుకోండి. వీటిపై కొంచెం నీళ్లు చల్లండి. ఆ తర్వాత మూతపెట్టి కొన్ని రోజులు అలాగే ఉంచండి. మధ్యమధ్యలో మూత తీసి బాగా కలిపి నీళ్లు చల్లుతూ ఉండండి. కొన్ని రోజుల తర్వాత ఎరువు సిద్ధంగా ఉంటుంది. ఒక మొక్కకు గుప్పెడు ఎరువు తీసుకుని మొదళ్లలో చల్లండి. ఆపై తేలికగా నీరు పెట్టండి. ఇలా చేయడం వల్ల మొక్కలకు తగిన పోషణ అంది అవి ఎండిపోవు.

ఉల్లిపొట్టు

ఉల్లి పొట్టు కూడా మొక్కలకు సహజ ఎరువుగా పనిచేస్తుంది. మొక్కలు ఎండిపోకుండా నివారించడంలో ఉల్లిపొట్టు కీలక పాత్ర పోషిస్తుంది. ఉల్లి పొట్టును అలా మొక్కల పొదల్లో వేసినా సరిపోతుంది. లేదంటే.. ఐదు లీటర్ల గోరు వెచ్చని వాటర్లో ఓ ఇరవై నుంచి ముప్పై గ్రాముల ఉల్లిపొట్టుని వేసి నాలుగు రోజుల పాటు అలానే ఉంచాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని మొక్కలపై పిచికారీ వేస్తే.. అవి ఎండిపోకుండా బాగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.

గమనిక

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. ఈ విషయాల్ని సమయం తెలుగు ధృవీకరించడం లేదు.